సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 14.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 202
పేజీలు: 08 వెల: రూ. 5

## వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది రియాలిటి
### పొదుపు మంత్రంతోనే ఆర్థిక స్థిరత్వం



- ప్రధాని సూచనలు పాటిద్దాం
- యుద్ధ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలి
- స్వదేశీ పర్యాటకానికి ప్రాధాన్యం
- రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణపై రెండ్రోజుల్లో విధాన ప్రకటన
- ఆటోపైలట్ మోడ్‌లో పరిశ్రమలకు అనుమతులు
- బైసర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

04



## మోదీ ఆపరేషన్ ఆకర్ష్
# మైండ్ గేమ్
## రేవంత్ రెడ్డి చుట్టూ రాజకీయ చక్రవ్యూహం

- బీజేపీ భవిష్యత్ ప్లాన్‌లో రేవంత్ రెడ్డి కీలక నేతగా మారుతున్నారా?
- కాంగ్రెస్ హైకమాండ్ అప్రమత్తం కావాల్సిందేనా?
- మరో వైపు తెలంగాణ లో కొత్త కూటమి కి ప్లాన్..?
- తెలంగాణలో మాస్ లీడర్ కోసం కమలం కొత్త లెక్కలు?
- బాబు, పవన్ ఇండ్లకు అందుకేనా?
- కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో మోదీ కొత్త కలకలం?
- బీజేపీ-కాంగ్రెస్ రాజకీయాల్లో హీట్ పెంచిన మోదీ

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** జాతీయ, తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న వ్యూహాలు అత్యంత ఆసక్తికరంగా, అదే సమయంలో ప్రత్యర్థి పార్టీలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలోని బలమైన, చురుకైన నాయకులను లక్ష్యంగా చేసుకుని మోదీ పన్నుతున్న మైండ్ గేమ్ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చుట్టూ తిరుగుతోంది. రాజకీయ వ్యూహంలో కొత్త కోణం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయాల్లో డైరెక్ట్ ఫైట్ కంటే సైకలాజికల్ వార్ చేయడంలో దిట్ట. కాంగ్రెస్ పార్టీలోని కీలక నాయకులను నేరుగా విమర్శించడం కంటే, వారిపై సొంత పార్టీలోనే అనుమానాలు కలిగేలా చేయడం మోదీ మార్కు రాజకీయం. గతంలో హిమంత బిస్వా శర్మ, జ్యోతిరాదిత్య సింధియా వంటి నేతల విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు ఆయన దృష్టి దక్షిణాదిలో కాంగ్రెస్‌కు పవర్ హౌస్‌గా మారిన రేవంత్ రెడ్డిపై పడింది. రేవంత్‌ను ప్రశంసించడం ద్వారా లేదా ఆయనకు సానుకూల సంకేతాలు పంపడం ద్వారా కాంగ్రెస్ హైకమాండ్ దృష్టిలో ఆయనను అనుమానితుడిగా నిలబెట్టాలనేది మోదీ వ్యూహంగా కనిపిస్తోంది.

**మోదీ పిలుపు - రేవంత్ సంకట స్థితి**

హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కలిసి రావాలని నర్మగర్భంగా పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. రేవంత్ రెడ్డి ఒకవైపు ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో సఖ్యతగా ఉండాల్సి వస్తోంది. విభజన హామీలు, నిధుల కోసం ఆయన ప్రధానితో భేటీ అవుతుంటే, దానిని రాజకీయంగా ఉపయోగించుకోవడంలో బీజే పీ వ్యూహకర్తలు సఫలమవుతున్నారు. ఇది రేవంత్‌కు ఒక రకమైన ధర్మసంకటం లాంటిదే. మిగతా 02లో



## మంత్రి అడ్లూరికి తప్పిన పెను ప్రమాదం
### కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి లిఫ్ట్ వైర్ తెగిపోవడంతో జరిగిన ప్రమాదం

- ఆసుపత్రుల నిర్వహణపై మంత్రి ఆగ్రహం..
- వేగంగా స్పందించని పోలీసులు, అధికారులపై ఫైర్

04

## ఐబొమ్మ మళ్లీ వచ్చేసింది




- రవి బెయిల్‌పై బయటకు రాగానే యాక్టివ్ అయిన ఐబొమ్మ
- కొత్త డొమైన్లతో తిరిగొచ్చిన పైరసీ బూతం
- థియేటర్, ఓటీటీ సినిమాలు మళ్లీ లీక్.. సినీ ఇండస్ట్రీ షాక్

02

## 15 విచారణకు హాజరవుతా..



- సాక్ష్యాలతో వస్తా.. సిట్ దర్యాప్తుకు సహకరిస్తా
- సిట్ పోలీసులకు బండి భగీరథ్ లేఖ

04

### హైదరాబాద్‌ను వణికిస్తున్న
# నేపాల్ గ్యాంగ్
### వెలుగులోకి మరో ఉదంతం

- ప్రొఫెసర్ దంపతులను బంధించి రూ. కోట్ల దోపిడీ
- పుట్టినరోజు వేడుక పేరుతో ప్లాన్..
- మత్తుమందు ఇచ్చి రూమ్‌లో బంధించారు..
- 60 తులాల బంగారంతో పరారైన దుండగులు
- ఇంట్లో పనిమనుషులుగా చేరి భారీ దోపిడీ..
- హైదరాబాద్ వాసుల్లో భయం పెంచుతున్న నేపాలి
- జాగ్రత్త పడకపోతే అంతే

**మాజీ ఐపీఎస్ భార్య హత్య మరువక ముందే షాక్..**




**ముద్ర డెస్క్ :** హైదరాబాద్ నగరంలో నేపాలి గ్యాంగ్ ఆడగాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. గత 4 రోజుల క్రితం మాజీ ఐపీఎస్ భార్యను అతి కిరాతకంగా హత్య చేసిన ఉదంతం మరువక ముందే మరో నేపాలి గ్యాంగ్ అరాచకం వెలుగులోకి వచ్చింది. కౌకూరులోని గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీధర్ మోహన్, డాక్టర్ విజయలక్ష్మి దంపతుల ఇంట్లో కొంతకాలంగా పనిమనుషులుగా ఉన్న ఓ నేపాలీ జంట మరికొందరితో కలిసి ఓనర్స్‌ను మిగతా 02లో

## విప్లవం నుంచి విద్య వైపు
### 4 దశాబ్దాల కల.. 3 గంటల పరీక్ష

- కాలం వెనక్కి మళ్లింది.. పరీక్ష హాల్లో 'దేవ్ జీ' ప్రత్యక్షం!
- 42 ఏళ్ల తర్వాత పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు

02



ఆయన చూపుల్లో ఇప్పటికీ అదే పట్టుదల.. కానీ ఆయుధం మారింది. ఒకప్పుడు రాజ్యహింసపై గర్జించిన ఆ గొంతుక.. ఇప్పుడు చట్టం ద్వారా పేదలకు న్యాయం చేయాలని తపిస్తోంది. 1982లో విప్లవ భావజాలంతో అడవి బాట పట్టినప్పుడు వదిలేసిన పెన్నును.. నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ చేతబట్టారు మాజీ మావోయిస్టు నేత దేవ్ జీ. ముడతలు పడిన చేతులతో ఆయన రాస్తున్నది కేవలం తెలుగు పరీక్ష కాదు.. తన జీవితంలో మిగిలిపోయిన ఒక వెలితిని పూడ్చుకునే ప్రయత్నం.

-ముద్ర ప్రతినిధి, జగిత్యాల:

### అప్రమత్తంగా ఉండండి

03

రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు




**అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు: మంత్రి పొంగులేటి**

### కేకేఆర్‌కు చావోరేవో..

04

ప్లేఆఫ్స్‌కు చేరాలంటే చివరి వరకు పోరాడాల్సిందే!



**ఆర్సీబీపై గెలిస్తేనే ముందుకు.. ఉత్కంఠ మ్యాచ్**

### బలపరీక్షలో 'విజయ'మే

04

దళపతికి మద్దతుగా 144 మంది ఓటింగ్



**అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా టీవీకేకే మద్దతు**



## మోదీ పొదుపు మంత్ర
### కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను తగ్గించాలని అదేశం

- అలాగే ఎస్కార్ట్, భద్రత సిబ్బంది కూడా కుదింపు
- సాధ్యమైనంతవరకు ఈవీ వాహనాలు ఉండాలని సూచన
- మోదీ బాటలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కూడా

02

## హైదరాబాద్‌కు మరో మణిహారం


02

- ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విస్తరణ
- ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్
- సీఎం తో ఉబెర్ సీఈఓ భేటీ



**ఇదీ AI ముద్ర**

మెడికల్ ఎక్సామ్ నీట్ పరీక్ష రద్దు చేయడంతో కాపీ కొట్టిన విద్యార్థులు రెంటికి చెడ్డ రేవడిలా మునిగారు. ఇటు కేసులు ఎదుర్కొంటూ.. అటు పరీక్షకు దూరమై నిండా మునిగారు.






సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 14.05.2026
www.mudranews.in | @mudranews



## పెసరపప్పు శరీరానికి శ్రేష్టం



వేసవి కాలంలో పెసరపప్పు శరీరానికి అత్యంత శ్రేష్ఠమైనది. ఇది శరీరానికి చలవ చేయడమే కాకుండా చాలా తేలికగా జీర్ణమవుతుంది



# మోడీ మైండ్ గేమ్

(మొదటి పేజీ కావాలి)

కేంద్రంతో గొడవ పెట్టుకుంటే రాష్ట్రానికి నష్టం, కలిసుంటే సొంత పార్టీలో ముద్ర పడే ప్రమాదం ఉంది. మరోవైపు, తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మలుచుకుంటోంది. రేవంత్ రెడ్డి ఏనాటికైనా బీజేపీలోకి వెళ్తారని, ఆయన ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వ్యక్తి అని కేటీఆర్ వంటి నేతలు పదేపదే ప్రచారం చేస్తున్నారు. బీజేపీ నేతల తో రేవంత్ టచ్‌లో ఉన్నారనే పుకార్లను లేవనెత్తడం ద్వారా కాంగ్రెస్ కేడర్‌లో, ప్రజల్లో గందరగోళం సృష్టించాలన్నది వారి ప్లాన్. మోదీ వేస్తున్న పాచికలకు బీఆర్ఎస్ ప్రచారం తోడవ్వడం రేవంత్‌కు రాజకీయంగా ఇబ్బందికర పరిణామమే.

**రేవంత్ దూకుడు - మోదీపై విమర్శలు**

అయితే రేవంత్ రెడ్డి శైలి ఇందుకు భిన్నంగా ఉంటుంది. రాజకీయ అవసరం ఏర్పడినప్పుడు మోదీని డెమోన్ అని విమర్శించడానికి కూడా ఆయన వెనుకాడరు. తెలంగాణా గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడంలో ఆయన చూపిన దూకుడు వెనుక మోదీ–షా ద్వయాన్ని ఢీకొనే ధైర్యం ఉంది. కానీ, మోదీ విసిరే ప్రశంసల అస్త్రాలు విమర్శల కంటే ప్రమాదకరమైనవి. శత్రువును విమర్శించడం కంటే, శత్రువును పొగడటం ద్వారా అతడిని సొంత గూటిలోనే ఒంటరిని చేసే మోదీ ఎత్తుగడలను రేవంత్ ఎలా తిప్పికొడతారన్నది ఆసక్తికరం.

**కాంగ్రెస్ హైకమాండ్ బాధ్యత**

ఇక్కడ అసలైన పరీక్ష రేవంత్ రెడ్డికి కాదు, కాంగ్రెస్ హైకమాండ్‌కే. గతంలో బలమైన నేతలను అనుమానించి, వారిని అవమానించి దూరం చేసుకున్న చరిత్ర కాంగ్రెస్‌కు ఉంది. ఇప్పుడు రేవంత్ విషయంలో కూడా అదే తప్పు చేస్తే అది కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ అవుతుంది. మోదీ వేసే పాచికల వెనుక ఉన్న అంతరార్థాన్ని గ్రహించి, రేవంత్‌ను రక్షించుకోవాల్సిన సమయం ఇది. రేవంత్‌ను ఏ మాత్రం అనుమానించినా, అది బీజేపీకి రహదారి వేసినట్లే అవుతుంది. కాబట్టి ఇప్పుడు అప్రమత్తంగా ఉండాల్సింది రేవంత్ కంటే ఎక్కువగా మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలే. మోదీ ఆడుతున్న ఈ రాజకీయ చదరంగంలో రేవంత్ రెడ్డి ఒక కీలకమైన పావు కాదు, రాజు. ఆ రాజును కాపాడుకోవడం కాంగ్రెస్ హైకమాండ్ చేతుల్లోనే ఉంది. నాయకుల మధ్య అనుమానపు బీజాలు నాటి కాంగ్రెస్‌ను దెబ్బకొట్టే మోదీ వ్యూహాన్ని తిప్పికొట్టాలంటే, కాంగ్రెస్ తన అంతర్గత బలాన్ని, నాయకత్వంపై నమ్మకాన్ని ప్రదర్శించాల్సి ఉంటుంది. రేవంత్ రెడ్డి వంటి చురుకైన నాయకుడిని కాపాడుకోలేకపోతే, దక్షిణాదిలో కాంగ్రెస్ కోట బీటలు వారడం ఖాయం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యూహాలు ఎప్పుడూ అత్యంత ఆశ్చర్యకరంగా, ముందస్తు ప్రణాళికతో కూడి ఉంటాయి. తాజాగా ఆయన హైదరాబాద్ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసాలకు వెళ్లి మరీ పలకరించడం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. దీని వెనుక కేవలం మర్యాదపూర్వక కలయిక మాత్రమే ఉందా లేక లోతైన రాజకీయ వ్యూహం దాగి ఉందా అనేది చాలా మందికి అర్థం కావడం లేదు.

**బాబు, పవన్ నివాసాలకు వెళ్లడానికి కారణం ఏమిటో ?**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 10న హైదరాబాద్ పర్యటనలో భాగంగా అనుకోని విధంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నివాసాలకు వెళ్లడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. స్వయంగా వారి ఇళ్లకు వెళ్లడం అనేది మోదీ ఇస్తున్న ఒక బలమైన రాజకీయ సంకేతం. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ కోటను బద్దలు కొట్టి, బీజేపీ జెండా పాతిన ఉత్సాహంలో ఉన్న మోదీ.. ఇప్పుడు తన తదుపరి లక్ష్యం తెలంగాణ అని ఈ పర్యటన ద్వారా స్పష్టం చేసినట్లు కనిపిస్తోంది. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో బీజేపీ బలపడుతోంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బెంగాల్, అస్సాంలలో బీజేపీకి అనుకూలంగా రావడంతో, అదే ఊపును తెలంగాణకు కూడా విస్తరించాలని మోదీ భావిస్తున్నారు. అందుకే, ఏపీలో సక్సెస్ అయిన ఎన్డీయే కూటమి ప్రయోగాన్ని తెలంగాణలోనూ అమలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచనలో మోదీ ఉన్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు, పవన్‌లతో భేటీ వెనుక తెలంగాణలో ఓటు బ్యాంకును సమీకరించే వ్యూహం దాగి ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**హైదరాబాద్ వీకెండ్ పాలిటిక్స్ -సస్పెన్స్ భేటీలు**

చంద్రబాబు నాయుడు వీకెండ్స్‌లో హైదరాబాద్‌లో ఉండటం సాధారణమే అయినా, పవన్ కళ్యాణ్ ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ప్రధాని నేరుగా వారి వద్దకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. షెడ్యూల్‌లో లేకపోయినా ఈ భేటీలు జరగడం అంటే.. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువగా చర్చకు వచ్చి ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సెటిలర్ల ఓట్లు అత్యంత కీలకం. ఈ ఓట్లను ప్రభావితం చేయడంలో చంద్రబాబు, పవన్‌లకు ఉన్న పట్టును ఉపయోగించుకుని, వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో ఎన్డీయేను ఒక బలమైన శక్తిగా మార్చడమే మోదీ లక్ష్యంగా కనిపిస్తోంది.

**దక్షిణాదిపై మోదీ చాణక్యం**

దక్షిణ భారత దేశంలో కర్ణాటక తర్వాత బీజేపీకి అత్యంత ఆశలు ఉన్న రాష్ట్రం తెలంగాణ. ఢిల్లీ మద్యం కేసు వంటి అంశాలతో బీఆర్ఎస్ బలహీనపడటం, కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరగడాన్ని సానుకూలంగా మార్చుకోవాలని మోదీ ప్లాన్ చేస్తున్నారు. ఏపీలో కూటమిని సమన్వయం చేసినట్లుగానే, తెలంగాణలోనూ చంద్రబాబు అనుభవాన్ని, పవన్ ఇమేజ్‌ను వాడుకుని క్లీన్ స్వీప్ చేయాలన్నదే ఆయన అంతరంగం కావచ్చు. అందుకే, కేవలం ఏపీ నేతలుగా కాకుండా ఎన్డీయే భాగస్వాములు గా వారిద్దరికీ మోదీ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని భావిస్తున్నారు. మోదీ రాజకీయ అడుగులు సామాన్యులకు అర్థం కావడం కష్టమే అయినా, తాజా భేటీలు మాత్రం తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పేలా ఉన్నాయి. అటు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తూనే, ఇటు మిత్రపక్షాలతో మంతనాలు జరపడం ద్వారా ఏకకాలంలో రెండు లక్ష్యాలను ఆయన సాధించాలనుకుంటున్నారు. చంద్రబాబు, పవన్‌లతో జరిపిన భేటీలు తెలంగాణలో ఎన్డీయే కూటమి ఏర్పాటుకు సంకేతంగా కనిపిస్తున్నాయి. ముందస్తు వ్యూహంతోనే మోదీ ఈ హోం విజిట్స్ చేసినట్లు నమ్ముతున్నారు.

## హైదరాబాద్‌ను వణికిస్తున్న
# నేపాల్ గ్యాంగ్


(మొదటి పేజీ తరువాయి)

బంధించి ఇంట్లో ఉన్న బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ ప్రొఫెసర్ ఇంట్లో కొంతకాలంగా ఒక నేపాలీ జంట పని మనుషులుగా ఉంటున్నారు. ఇటీవల వారి బంధువుగా చెబుతూ మరో మహిళ కూడా ఆ ఇంట్లో చేరింది. సోమవారం రాత్రి సదరు మహిళ పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటామని ప్రొఫెసర్‌ను అనుమతి కోరారు. వారిని నమ్మిన ప్రొఫెసర్ దంపతులు అందుకు అంగీకరించారు. ఇక ముందే చేసుకున్న ప్లాన్ ప్రకారం.. వేడుకల నెపంతో ఆ నేపాలీ ముఠా మరో ముగ్గురు వ్యక్తులను రహస్యంగా ఇంట్లోకి రప్పించింది. దంపతులు భోజనం చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వారిపై దాడి చేసి వారిని బంధించింది.

అయితే ఇంటి యజమానులు వారిని ఒదిలేయాలని వేడుకున్నారు. మీకు కావాల్సింది తీసుకెళ్లండి కానీ మమ్మల్ని మాత్రం చంపకండి అని బాధితులు ప్రాధేయపడటంతో వారికి మత్తు మందు ఇచ్చి ఓ రూమ్‌లో బంధించారు. అనంతరం ఈ గ్యాంగ్ ఇంట్లో ఉన్న 60 తులాల బంగారం, వెండి, 30 వేలు నగదు తీసుకొని అక్కడి నుంచి పారిపోయారు. ఇక మరుసటి రోజు మత్తు దిగిన తర్వాత బాధితులు కేకలు వేయడంతో గమనించిన స్థానికులు వచ్చి తలుపులు పగులగొట్టి వారిని రక్షించారు. సమాచారం అందుకున్న మల్కాజిగిరి డీసీపీ వివరాలు సేకరించారు. ఈ దోపిడీలో మొత్తం ఏడుగురు పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు.

# ఐబొమ్మ మళ్లీ వచ్చేసింది




**ముద్ర డెస్క్ :**

తెలుగు సినీ పరిశ్రమకు బిగ్ షాక్ తగిలింది. ఒకప్పుడు తీవ్రంగా ఇబ్బంది పెట్టి, వదిలి వెళ్లిపోయిన పైరసీ బూతం 'ఐబొమ్మ 'మళ్లీ వచ్చేసింది. తాజాగా రిలీజ్ అయిన కొత్త సినిమాలన్నీ ఈ వెబ్‌సైట్‌లో కనినిపిస్తున్నాయి. ఈ సైట్ నిర్వాహకుడు రవి అరెస్ట్ కావడంతో ఇక ఈ సమస్య తీరిపోయిందని భావించిన సినీ పెద్దలకు తాజా పరిణామాలు షాక్ ఇస్తున్నాయి.

కొన్ని నెలల క్రితం సైబరాబాద్ పోలీసులు ఈ నెట్‌వర్క్‌ను ఛేదించి, కీలక సూత్రధారిగా భావిస్తున్న రవిని అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల ఆయన బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే సైట్ మళ్లీ ప్రత్యక్షమవ్వడం చర్చనీయాంశంగా మారింది.

ప్రస్తుతం ఐబొమ్మ తన డొమైన్లను మార్చుకుంటూ మళ్లీ రంగ ప్రవేశం చేసింది. థియేటర్లలో ఉన్న తాజా చిత్రాలు, ఓటీటీలో విడుదలైన కొత్త కంటెంట్ ఈ సైట్‌లో ప్రత్యక్షమవుతుండటంతో సినీ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. నిర్వాహకుడు బెయిల్‌పై ఉన్న సమయంలోనే సైట్ మళ్లీ యాక్టివ్ అవ్వడం వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పోలీసులు నిశితంగా గమనిస్తున్నారు.



# విప్లవం నుంచి విద్య వైపు

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

ఒకప్పుడు విప్లవ భావజాలంతో అడవిబాట పట్టిన మాజీ మావోయిస్టు నేత... ఇప్పుడు విద్యతో కొత్త జీవితానికి నాంది పలికారు. జగిత్యాల జిల్లా కోరుట్లలో బుధవారం జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో కనిపించిన ఒక వ్యక్తి మాత్రం అందరి దృష్టిని ఆకర్షించాడు. ఒకప్పుడు అడవుల్లో తుపాకీతో తిరిగిన మాజీ మావోయిస్టు అగ్రనేత, నేడు పెన్నుతో పరీక్ష రాయడానికి పరీక్షా హాల్లోకి అడుగుపెట్టారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన కామ్రేడ్ తిప్పిరి తిరుపతి అలియాస్ "దేవ్ జీ" సుమారు 42 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి పరీక్ష రాయడం విశేషంగా మారింది. 1982లో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న సమయంలో ఆయన తెలుగు పరీక్ష తప్పిపోయింది. ఆ ఒక్క పరీక్ష రాయకపోవడంతో ఇంటర్ విద్య అసంపూర్తిగానే మిగిలిపోయింది. అదే సమయంలో సమాజంలో ఉన్న అసమానతలు, పేదల సమస్యలు, అన్యాయాలు ఆయన మనసును కదిలించాయి. విద్యార్థి జీవితాన్నే వదిలి విప్లవ బాట పట్టారు. కానీ జీవితంలో ఒక అసంపూర్తి మాత్రం ఎప్పటికీ ఆయనను వెంటాడింది. 1982లో రాయకపోయిన తెలుగు పరీక్ష. ఆ అసంపూర్తిని పూర్తి చేయాలనే సంకల్పంతో ఆయన ఇంటర్ బోర్డును సంప్రదించారు. ప్రత్యేక అనుమతి పొందారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు హాజరయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత పరీక్షా హాల్లోకి అడుగుపెట్టిన దేవ్ జీని చూసి అక్కడి విద్యార్థులు, అధికారులు ఆశ్చర్యపోయారు. కొందరు ఆసక్తిగా గమనించారు. మరికొందరు ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. దేవ్ జీ మాట్లాడుతూ ఇంటర్ పూర్తి చేసిన తర్వాత న్యాయ విద్య అభ్యసించాలని ఉంది. పేదలకు న్యాయ సహాయం అందించాలనేది నా కోరిక అని తెలిపారు.

# హైదరాబాద్‌కు మరో మణిహారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. అవకాశం ఉంటే మల్టీ లెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన కోరారు. ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్ లో నివాసంలోని ఆయన నివాసంలో భేటీ అయింది. ఈ సందర్భంగా దారా ఖోస్రోషాహి..

ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన సీఎం కోరారు.



కాగా, దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు సీఎం సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు. శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని సీఎం తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో వందకు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబెర్ ఇండియా అండ్ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

# మోదీ పొదుపు మంత్ర

**ముద్ర డెస్క్ :**

ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య భారీగా తగ్గింది. 2 వాహనాల కాన్వాయ్ తోనే ఆయన ప్రయాణించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ మేరకు మార్పులు చేశారు. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు పొదుపు మంత్రం పాటించాలని సూచించిన ప్రధాని మోదీ.. స్వయంగా వాటిని పాటిస్తున్నారు. ఈ క్రమంలోనే తన అధికారిక కాన్వాయ్ వాహనాల సంఖ్య తగ్గించారు. సాధారణంగా, ప్రధాని కాన్వాయ్‌లో మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారు, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12–15 వాహనాలు ఉంటాయి. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని మోదీ ఆదేశించినట్లు ఉదయం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (SPG) అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన వెళ్లే దారుల్లో తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తామన్నారు.

**కాన్వాయ్ కుదించుకున్న కేంద్రమంత్రులు**

ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా మంత్రులు తమ కాన్వాయ్ సైజును రెండు వాహనాలకు కుదించుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య తగ్గించుకున్నట్లు వెల్లడించారు.

## ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌లకు ఓఆర్ఆర్‌లు

**ముద్ర డెస్క్ :**

ఖమ్మం, వరంగల్, కరీంనగర్ కార్పొరేషన్లకు ఓఆర్ఆర్‌లు వేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాబోయే విమానాశ్రయాలను దృష్టిలో పెట్టుకొని రోడ్లు నిర్మించాలన్నారు. మెగా గ్రోత్ కారిడార్‌పై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. 'అవసరమైన ఎస్టీపీలు రూపొందించాలి. అండర్ డ్రైనేజీల నిర్మాణానికి సాంకేతికత వినియోగించుకోవాలి. ఖర్చు తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలు ప్రవేశపెట్టాలి. ప్రతిచోట పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తయ్యేలా చూడాలి. పట్టణాల కేంద్రంగా అభివృద్ధి ప్రణాళిక ఉండాలి. మున్సిపాలిటీల్లో సోలార్ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. రేడియేషన్ తగ్గింపునకు మల్టీ యుటిలిటీ టవర్స్ ఏర్పాటు చేయాలి.



సింగరేణి సీఎస్ఆర్ నిధులను స్థానికంగానే ఖర్చుపెట్టాలి. నల్గొండ, యాదగిరిగుట్ట మధ్య టెంపుల్ కారిడార్ ఏర్పాటు చేయాలి. ఆదిలాబాద్, నాగోబా, బాసర, కడెం ప్రాజెక్టులను కలుపుతూ టూరిజం కారిడార్ ఏర్పాటు చేయాలి. అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. మహబూబాబ్ నగర్, భూత్పూర్, జడ్చర్లను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలి. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌ను కలిపి కారిడార్ ఏర్పాటు చేయాలి. పెద్ద మున్సిపాలిటీలకు సమీపంలో రేడియల్ రోడ్లు ఉండాలి. వరంగల్, కరీంనగర్, ఖమ్మం కారిడార్ తెలంగాణకు కీలకం. రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తారు' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

## మరో వైరస్ కలకలం..
# నౌకలో 1700 మంది

**ముద్ర , డెస్క్ :**

ఇటీవల ఓ క్రూజ్ నౌకలో హంటా వైరస్ వ్యాప్తి ఘటన మరువక ముందే.. మరో నౌకలోని ప్రయాణికుల్లో నోరోవైరస్ లక్షణాలు బయటపడటం కలకలం సృష్టిస్తోంది. ఉత్తర ఐర్లాండ్ బెల్‌ఫాస్ట్ నుంచి స్పెయిన్‌కు వెళ్తున్న 'యాంబిషన్' అనే క్రూజ్ నౌకలో నోరోవైరస్ అనుమానిత లక్షణాలతో 90 ఏళ్ల వ్యక్తి మృతి చెందాడు. దీంతో ఫ్రాన్స్‌లోని బోర్డెక్స్‌లో నౌకను నిలిపివేశారు.

సుమారు 1,700 మందికిపైగా ప్రయాణికులు, సిబ్బందిని నౌకలోనే క్వారంటైన్ చేశారు. ఇప్పటికే మరో 50 మందిలో ఈ వైరస్ లక్షణాలు బయటపడినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల ఎంవీ హొండియస్ నౌకలో హంటా వైరస్ కారణంగా ముగ్గురు చనిపోయిన విషయం తెలిసిందే. అయితే, ఆ వైరస్ వ్యాప్తితో దీనికి ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.

నోరోవైరస్‌ను 'వామిటింగ్ బగ్' అని కూడా అంటారు. కలుషితమైన ఆహారం కారణంగా శరీరంలోకి ప్రవేశిస్తుందని అమెరికన్ సీడీసీ వెల్లడించింది. అన్ని వయసుల వారికీ ఇది సోకుతుంది. విరేచనాలు, వాంతులు, కడుపు నొప్పి, వికారం, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాల ద్వారా గుర్తించవచ్చు. అయితే, ఈ వైరస్ బాధితులు చాలా మంది ఎలాంటి చికిత్స లేకుండానే కోలుకుంటారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 14.05.2026
www.mudranews.in | @mudranews



## పెసరపప్పు



పెసరపప్పుతో శరీర ఉష్ణోగ్రత నియంత్రణ పెసరపప్పు శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుతుంది. ఎండ దెబ్బ నుండి ఉపశమనం పొందడానికి పెసరపప్పు కట్టు లేదా పప్పుచారు తీసుకోవడం చాలా మంచిది.

## బండి భగీరథ్ ను వెంటనే అరెస్ట్ చేయాలి

**- బీ ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్**



**ముద్ర, వనపర్తి ప్రతినిధి :** ఫోక్సో కేసు నమోదైన బండి భగీరథ్ వెంటనే అరెస్ట్ చేయాలని బీ ఆర్ ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఒక్కటై కేసుని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు కేంద్ర మంత్రి, సీఎం మధ్య ఉన్న రాజకీయ అనుబంధం వల్లే కేసు బలహీనపడుతోందని విమర్శించారు. నిందితుడికి నోటీసులు ఇచ్చి వదిలేయడం చట్టాన్ని అవమానపరచడమేనన్నారు. బాధిత కుటుంబంపై కేసులు నమోదు చేయడం, వారిని బెదిరించడం వంటి చర్యలు అమానుషమన్నారు. పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా పని చేయాలని సూచించారు. పోక్సో కేసులో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఆలస్యం చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నిందితుడు విదేశాలకు పారిపోయాడా లేదా అనే విషయాన్ని పోలీసులు స్పష్టం చేయలేదతన్నారు. మహిళల భద్రతకు ముప్పు కలిగించే ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు చట్టానికి కట్టుబడి పని చేయాలని నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్న నేతలు చట్ట వ్యతిరేక పనులు చేస్తే సమాజం బలహీనపడుతుందన్నారు. రాజ్యాంగబద్ధ వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి సంస్థపై ఉందన్నారు. మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం జరగాలంటే చట్టాన్ని సమానంగా అమలు చేయాలని, రాజకీయ ప్రలోభాలకు లోనుకాకుండా అధికారులు పని చేయాలని కోరారు. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించి నిజాలను వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కరుణశ్రీ సాయి కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## పెళ్లి పేరుతో మోసం: సస్పెండెడ్ ఎస్సై సురేష్ అరెస్ట్



**ముద్ర. కూకట్ పల్లి :** పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేసిన ఆరోపణలపై సస్పెండెడ్ ఎస్సై సురేష్‌ను కూకట్‌పల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సురేశ్ కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తూ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నాడు. ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాధితురాలు కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా తనను వేధిస్తున్నాడని, పెళ్లి మాట ఎత్తితే తప్పించుకుంటున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సురేష్‌ను ఈ రోజు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుపై మరిన్ని వివరాల కోసం పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## సరస్వతీ అంత్య పుష్కరాలకు రండి


**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానించిన దేవాదాయ అధికారులు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఈనెల 21 నుండి ప్రారంభమయ్యే సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి ఆహ్వానం అందింది. బుధవారం దేవాదాయ శాఖ అధికారులు,అర్చకులు మంత్రుల నివాస సముదాయంలోనీ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంత రావు,అర్చకులు వేద మంత్రోచ్చారణ నడుమ శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందజేశారు. గత ఏడాది సరస్వతి పుష్కరాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరైన నేపథ్యంలో...గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరస్వతి అంత్య పుష్కరాలకు రోడ్లు భవనాలు శాఖ తరుపున అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేవాదాయ శాఖ అధికారులు..ఆర్ అండ్ బి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పుష్కరాలను విజయవంతం చేయాలని సూచించారు.రాబోయే గోదావరి పుష్కరాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే భక్తుల కోసం ఏర్పాట్లు ప్రారంభించిందని,రోడ్లు భవనాలు శాఖ అధ్వర్యంలో పుష్కర ఘాట్ల నిర్మాణం,రోడ్ కనెక్టివిటీ లాంటి భక్తుల సౌకర్యాలపై ప్రధాన దృష్టి సారించినట్లు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.

# బండి భగీరథ్ ను తప్పించే అవసరం లేదు

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**
**కేసులో ఎలాంటి జాప్యం లేదు**
**చట్ట ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవు**
**బాధితురాలికి న్యాయం జరిగే వరకు వెనుకంజ వేయం**
**కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయి**
**ఎస్ఐఆర్ తో తెలంగాణలోనూ అక్రమాలు చేయాలని చూస్తోంది**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** మైనర్ బాలికపై లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు ఏ మాత్రం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని చెప్పారు. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఈ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ వెనుకంజ వేయదని స్పష్టం చేశారు. తాము నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని అన్నారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మి కి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నా రని, కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణ లోనూ ఎస్ఐఆర్తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు లేవన్నారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని వ్యాఖ్యానించారు.

# లింక్ కెనాల్ పనులు వేగవంతం చేయాలి

**బొల్లారంలో భూబాధిత రైతులతో మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖాముఖి**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** సింగోటం–గోపాలదిన్నె లింక్ కెనాల్ పనులను త్వరితగతిన పూర్తిచేసి చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ విలువ కంటే మూడింతల పరిహారం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామంలోని రైతు వేదికలో సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాలకు చెందిన భూబాధిత రైతులతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభ్యంతరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ.11.50 లక్షల పరిహారం ప్రస్తుతం ప్రభుత్వ మార్కెట్ విలువ రూ.1,87,500 చాలా తక్కువగా ఉందని రైతులు అభ్యంతరం వ్యక్తం చేయగా మంత్రి సానుకూలంగా స్పందించారు. బేసిక్ మార్కెట్ విలువను వెంటనే రెండింతలు పెంచి రూ.3,75,000గా ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పెంచిన విలువ ఆధారంగా భూసేకరణ చట్టం ప్రకారం మూడింతల పరిహారంతో పాటు గెజిట్ ప్రచురించిన తేదీ నుంచి వడ్డీ కలిపి ఎకరాకు మొత్తం రూ.11,50,000 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంత్రి నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. పరిహార పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి తక్షణమే అవార్డు కాపీలు మంజూరు చేయాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యంకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అసైన్డ్, పట్టా లేని రైతులకూ సమన్యాయం సాధారణ పట్టాదారులతో పాటు అసైన్డ్ పట్టాలు కలిగిన రైతులకు కూడా సమాన పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. అసైన్డ్ పట్టాదారులతో పాటు, ఎలాంటి పట్టాలు లేకుండా చాలాకాలంగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతులకు కూడా భూసేకరణ చట్టంలోని '3ఆర్' నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

**40 వేల ఎకరాలకు సాగునీరు లక్ష్యం**

కొల్లాపూర్ నియోజకవర్గంలోని వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో జూరాల ప్రాజెక్టు కింద 25 వేల ఎకరాలు, భీమా ప్రాజెక్టు కింద 15 వేల ఎకరాలు కలిపి మొత్తం 40 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని మంత్రి తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 2018లో సింగోటం–గోపాలదిన్నె లింక్ కెనాల్‌కు పరిపాలనా అనుమతులు మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. కెనాల్ నిర్మాణం కోసం మొత్తం 305.23 ఎకరాల భూమి సేకరించాల్సి ఉందన్నారు. భూసేకరణ వివరాలు నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం నర్సాయిపల్లి–50 ఎకరాలు, వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం బొల్లారం – 73 ఎకరాల 13 గుంటలు, వల్లభాపూర్ – 87 ఎకరాల 3 గుంటలు, సంగినేనిపల్లి – 94 ఎకరాల 8 గుంటలు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా భూసేకరణ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బొల్లారం, తూముకుంట సర్పంచులు సుదర్శన్ రెడ్డి, రామన్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల్లో..**

# అల్ఫోర్స్ విద్యార్థుల ఘన విజయం



**ముద్ర, కరీంనగర్:** స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో అల్ఫోర్స్ సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ పాఠశాల విద్యార్థులు 12వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన సందర్భంగా ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చక్కటి ప్రణాళికలు మరియు సరైన సమీక్షా విధానాల ద్వారా విద్యార్థులు సులభంగా విజయాలను సాధించగలరని తెలిపారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో అత్యున్నత విద్యా ప్రమాణాలను పాటిస్తూ, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన అధ్యాపకులచే బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ, ప్రకటించిన ప్రతి పరీక్ష ఫలితాల్లో స్ఫూర్తిదాయక విజయాలు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు.ఈ ఏడాది ఫలితాల్లో 7 మంది విద్యార్థులు 460కు పైగా మార్కులు సాధించగా, 47 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించడం విశేషమని తెలిపారు.పీసీఎం విభాగంలో వి. శ్రేయాస్ రెడ్డి 475 మార్కులతో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. జి. చైత్ర 471 మార్కులు, ఎన్. రత్నప్రకాష్ 469 మార్కులు, బి. లిఖిత్ సాయి 461 మార్కులు, కే. ఐశ్వర్య 458 మార్కులు, హర్షఫ్ అర్మాన్ మరియు వి. సాయి హర్షిత్ తలో 456 మార్కులు, బి. రోహిత్ 455 మార్కులు, ఎన్. కావ్య మరియు జె. సరయు తలో 450 మార్కులు సాధించి ప్రతిభ చాటారు.పీసీబీ విభాగంలో డి. రుత్విక్ 476 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. పి. శృత్విక 472 మార్కులు, డి. శ్రేయన్ష్ 462 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు.అధ్యాపకుల నిరంతర కృషి, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని డాక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. గత 36 సంవత్సరాలుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు ప్రపంచ ప్రమాణాలతో విద్యను అందిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంస్థగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు, స్కోర్ కార్డులు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## బొలెరో వాహనం బోల్తా

**బాలుడు మృతి.. 10 మందికి గాయాలు**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:** పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో బొలెరో వాహనం బోల్తా పడిన ప్రమాదం లో బాలుడు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు. ఈ సంఘటన బుధవారం మహబూబ్ నగర్ కలెక్టరేట్ ఎదుట భూత్పూర్ రహదారి పై జరిగింది. దేవరకద్ర నియోజకవర్గం లోని దమగ్న పూర్ గ్రామం నుంచి భూత్పూర్ మండలం కొత్త మొల్గర గ్రామంలో పెళ్లికి వెళ్లేందుకు బొలెరో వాహనం లో 30 మంది బయలు దేరారు.పెళ్లికి వెళ్లి తిరుగు ప్రయాణం లో కలెక్టర్ కార్యాలయం ఎదుట వీరు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ వేగాన్ని నియంత్రించలేక డివైడర్ ఢీ కొట్టడంతో వాహనం బోల్తా పడిందని స్వల్ప గాయాలతో బయటపడ్డవారు తెలిపారు.ఈ ప్రమాదం లో బాలుడు మృతి చెందగా 10 మంది గాయపడ్డారు.తీవ్రంగా గాయపడిన వారిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి కి తరలించారు.ఈ ప్రమాదం పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అప్రమత్తంగా ఉండండి

**44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు మధ్యాహ్న వేళల్లో బయటకు రావొద్దు**
**ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కలెక్టర్లు ముందస్తు చర్యలు చేపట్టాలి**
**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. రానున్న ఆరు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్ర వడగాలులు, 44 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశ ముందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్లు, అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఒకవైపు భగ్గుమంటున్న ఎండలు, మరోవైపు ఈదురు గాలులు, ఉరుములు–మెరుపులతో కూడిన అకాల వర్షాలు సంభవించే పరిస్థితులు ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యం గా ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తదుపరి రోజుల్లో జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో కూడా ఎండల తీవ్రత పెరిగే అవకాశముందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని, ఎండలో పనిచేసే వారు తలకు రక్షణ కల్పించే వస్త్రాలు ధరించాలని సూచించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ వడదెబ్బ నివారణ చర్యలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు, రహదారులపై పనిచేసే కార్మికులు ఎండ తీవ్రత సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈదురు గాలులు, ఉరుములు–మెరుపులు సంభవించే ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద నిలబడకుండా, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోందని తెలిపారు..

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

గురువారం 14.05.2026

www.mudranews.in | @mudranews



### ఎర్ర కందిపప్పుతో శక్తి

మసూర్ పప్పు (ఎర్ర కందిపప్పు) లో ఐరన్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో శక్తిని పెంచి, వేసవిలో కలిగే నీరసాన్ని తగ్గిస్తుంది.



# సూడాన్ సంక్షోభం



అరబిక్ భాషలో "సూడాన్" అంటే "నల్లనిది" అని అర్థం. ఈశాన్య ఆఫ్రికా ఖండంలో ఉన్న ఈ దేశం ఉత్తరాన ఈజిప్టు, తూర్పున ఎర్ర సముద్రం, ఎరిత్రియా, ఇథియోపియా, దక్షిణాన కెన్యా, ఉగాండా, పశ్చిమాన చద్, వాయువ్యంలో లిబియాలతో సరిహద్దులను కలిగి ఉంది. రాజధాని ఖర్తూమ్ నైలు, బ్లూ నైలు నదుల సంగమ ప్రాంతంలో ఉంది. 2011 జూలై 9న సూడాన్ దేశం విడిపోయి దక్షిణ సూడాన్ అనే కొత్త దేశం ఏర్పడింది. అప్పటి నుంచి రెండు సూడాన్లు ఉనికిలోకి వచ్చాయి.

సూడాన్‌లో దశాబ్దాలుగా అంతర్యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నాయి. మత, జాతి, సామాజిక–ఆర్థిక అసమానతలు, రాజకీయ ఆధిపత్య పోరాటాలు ఈ దేశాన్ని ఎప్పటికప్పుడు ఘర్షణల వైపు నెట్టాయి. ఉత్తర సూడాన్‌లో అరబ్ ముస్లింల ప్రభావం అధికంగా ఉండగా, దక్షిణ ప్రాంతంలో డింకా, న్యూర్, అజాండి వంటి ఆఫ్రికన్ తెగల ఆధిపత్యం ఉంది. ఉత్తరంలో నుబియన్, బెజా, ఫర్, జగావా తెగలు ప్రధానంగా ఇస్లాంను ఆచరిస్తాయి.

1980ల నుంచే సూడాన్‌లో అంతర్యుద్ధం తీవ్రరూపం దాల్చింది. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది గ్రామాలు ధ్వంసమయ్యాయి. మహిళలపై అత్యాచారాలు, ప్రజల నిరాశ్రయ జీవితం ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. 2005లో SPLM/A మరియు సూడాన్ ప్రభుత్వానికి మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. అధికార, ఆస్తుల పంపిణీతో పాటు భద్రతా పరిపాలనపై కూడా అంగీకారం ఏర్పడింది. ఈ ప్రక్రియలో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషించింది. దాని ఫలితంగానే 2011లో దక్షిణ సూడాన్ స్వతంత్ర దేశంగా అవతరించింది. 1989లో బ్రిగేడియర్ జనరల్ ఒమర్ అల్ బషీర్ సైనిక తిరుగుబాటు ద్వారా అధికారంలోకి వచ్చాడు. అప్పటి ప్రజాస్వామ్య ప్రధానమంత్రి సాధిక్ అల్ మహదిని తొలగించి దేశంలో సైనిక రాజకీయాలకు నాంది పలికాడు. 30 సంవత్సరాల పాటు దాదాపు నియంతృత్వ పాలన కొనసాగించాడు. అన్ని అధికారాలను తన చేతుల్లోనే ఉంచుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచాడు. అతని పాలనలోనే అంతర్యుద్ధాలు మరింత ముదిరాయి.

2019లో జనరల్ అబ్దుల్ ఫతా అల్ బుర్హాన్ మరియు రాపిడ్ సపోర్ట్ ఫోర్స్ (ఆర్.ఎస్.ఆఫ్) నేత మహ్మద్ హమదాన్ దగాలో కలిసి ఒమర్ అల్ బషీర్‌ను గద్దె దించారు. ఆ తర్వాత అల్ బుర్హాన్ దేశాధ్యక్షుడిగా ప్రకటించుకోగా, దగాలో ఉపాధ్యక్షుడిగా ఎదిగాడు. మొదట ఇద్దరూ మిత్రులుగా పనిచేసినా, తర్వాత అధికార పోరు ప్రారంభమైంది. ముఖ్యంగా రాజధాని ఖర్తూమ్‌పై ఆధిపత్యం కోసం ఇద్దరి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయి.

అల్ బుర్హాన్ అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలతో సంబంధాలు పెంపొందించుకోవాలని ప్రయత్నించాడు. పరివర్తన సార్వభౌమత్వ మండలి పేరుతో పౌర–సైనిక భాగస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రకటించాడు. అయితే అది కేవలం అంతర్జాతీయ ప్రపంచాన్ని ఆకట్టుకునేందుకు చేసిన చర్యగానే విమర్శలు వచ్చాయి.

ఇక దగాలో దార్ఫూర్ ప్రాంతానికి చెందినవాడు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అతను అణగారిన వర్గాల నాయకుడిగా ఎదగాలని ప్రయత్నించాడు. దార్ఫూర్‌లోని బంగారు గనులపై, రవాణా, వ్యాపార రంగాలపై ప్రభావం పెంచుకున్నాడు. తిరుగుబాటు వర్గాలతో సంబంధాలు బలోపేతం చేసుకున్నాడు. దీంతో అతని ప్రభావం సైనిక, ఆర్థిక రంగాల్లో వేగంగా పెరిగింది.

2021 అక్టోబర్‌లో మరోసారి సైనిక తిరుగుబాటు జరిగింది. అల్ బుర్హాన్ పౌర రాజకీయ నాయకులను అరెస్టు చేసి పూర్తిస్థాయి మిలటరీ పాలనను అమలు చేశాడు. దీనికి దగాలో మొదట మద్దతు ఇచ్చినా, తర్వాత ఇద్దరి మధ్య విభేదాలు బహిర్గతమయ్యాయి. ముఖ్యంగా RSF దళాలను సూడాన్ సైన్యంలో విలీనం చేయాలన్న ప్రతిపాదనను దగాలో తీవ్రంగా వ్యతిరేకించాడు. అదే చివరకు పెద్ద యుద్ధానికి దారితీసింది.

2023 ఏప్రిల్ 15న సూడాన్‌లో మళ్లీ భారీ ఘర్షణలు ప్రారంభమయ్యాయి. సూడాన్ సైన్యం మరియు RSF మధ్య కాల్పులు, వైమానిక దాడులు తీవ్రరూపం దాల్చాయి. ఖర్తూమ్ సహా అనేక నగరాలు యుద్ధ భూములుగా మారాయి. వేలాది మంది మరణించగా, లక్షలాది మంది తమ ఇళ్లు విడిచి పారిపోవాల్సి వచ్చింది. మహిళలపై దారుణాలు, ఆకలి, ఆరోగ్య సమస్యలు పెరిగాయి. ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభాల్లో ఒకటిగా సూడాన్ పరిస్థితి మారింది.

సూడాన్ సంక్షోభం కేవలం అంతర్గత రాజకీయ పోరాటం మాత్రమే కాదు. అమెరికా, రష్యా, చైనా, గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్ వంటి దేశాల భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు కూడా దీనిపై ప్రభా వం చూపుతున్నాయి. అందువల్ల సూడాన్‌లో శాంతి స్థాపన ఇప్పటికీ క్లిష్టమైన సవాలుగానే కొనసాగుతోంది.



- డా.సుంకర రమేశ్
ఆర్థిక శాస్త్ర ఉపన్యాసకులు
9492180764

## 15 విచారణకు హాజరవుతా..

**సిట్ పోలీసులకు బండి భగీరథ్ లేఖ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పేట్ బషీరాబాద్ పోలీసులకు లేఖ పంపించారు. బుధవారం మధ్యాహ్నం పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, వ్యక్తిగత కారణాల నేపథ్యంలో ఈ నెల 15న విచారణకు హాజరవుతానని పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు ఈమెయిల్‌తో పాటు అధికారిక లేఖను కూడా బండి భగీరథ్ పంపించారు. ఈ కేసులో విచారణకు హాజరయ్యే సమయంలో కీలక ఆధారాలు, సాక్ష్యాలతో వస్తానని ఆయన స్పష్టం చేశారు. అలాగే సిట్ అధికారుల దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరిస్తానని భగీరథ్ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో అవసరమైన సమాచారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

## బలపరీక్షలో 'విజయ'మే

**దళపతికి మద్దతుగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటింగ్**



**ముద్ర డెస్క్ :** తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ శాసనసభలోనూ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో నెగ్గింది. బలపరీక్షకు సంబంధించి ఈ ఉదయం విజయ్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ చేపట్టిన అనంతరం స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. ఇది ఆసక్తికరంగా సాగింది. సాధారణ ఓటింగ్ మాదిరిగా కాకుండా.. ఒక్కో సభ్యుడి పేరు పిలుస్తూ ఎమ్మెల్యేల సమ్మతిని సభాపతి నమోదు చేసుకున్నారు.ఇందులో విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటేశారు. 22 మంది సభ్యులు వ్యతిరేకించారు. బలపరీక్ష సమయంలో అసెంబ్లీ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు మద్దతిచ్చాయి. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా సీఎంకు అనుకూలంగా ఓటేశారు.

## కేకేఆర్‌కు చావోరేవో..

**- ప్లేఆఫ్స్‌కు చేరాలంటే చివరి వరకు పోరాడాల్సిందే!**



**ముద్ర డెస్క్ :** ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుత కంబ్యాక్‌తో మళ్లీ ప్లేఆఫ్స్ రేసులోకి వచ్చింది. సీజన్ ఆరంభంలో ఆరు మ్యాచ్‌ల్లో ఐదింటిలో ఓడిపోయి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న కేకేఆర్.. ఇప్పుడు వరుసగా నాలుగు విజయాలతో జోరు మీదున్నాడు. ప్రస్తుతం మిగిలిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిస్తే 17 పాయింట్లతో ప్లేఆఫ్స్ అవకాశాలను బలంగా నిలబెట్టుకోనుంది.ఈరోజు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగే మ్యాచ్ కేకేఆర్‌కు కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ప్లేఆఫ్స్ ఆశలు మరింత బలపడతాయి. ఓడిపోతే మాత్రం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ముఖ్యంగా పంజాబ్ కింగ్స్, చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు వరుస పరాజయాలు చవిచూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ 16 పాయింట్లతో టేబుల్ టాప్‌లో ఉండగా.. బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు 14 పాయింట్లతో బలమైన స్థితిలో ఉన్నాయి. దీంతో ఈసారి ప్లేఆఫ్స్ పోరు చివరి మ్యాచ్ వరకు ఉత్కంఠభరితంగా కొనసాగే అవకాశం ఉంది. కేకేఆర్‌కు ఇప్పుడు ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై'గా మారింది.

## డబుల్ ఇంజిన్' అంటే పేపర్ల లీకేజీయేనా?

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**ముద్ర, ఖమ్మం :** కేంద్రంలోని బీజేపీ సర్కార్ తన అసమర్థతతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని రాష్ట్ర రెవెన్యూ శాం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆరోపించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి చేయడం కాదు.. పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా? అని నిలదీశారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై ధ్వజమెత్తారు. పరీక్షకు 42 గంటల ముందే పేపర్లు బయటకు రావడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా 23 లక్షల మంది మన రాష్ట్రంలో 70 వేల మంది విద్యార్థులు ఈ కుంభకోణంతో రోడ్డున పడ్డారని అవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మాత్రం ఏమీ ఎరుగనట్లు నాటకమాడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**నాడు దొరల పాలనలోనూ...**

తెలంగాణలో గత పదేళ్ల 'దొరల పాలన'లో జరిగిన అన్యాయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రూప్–1 నుంచి గ్రూప్–4 వరకు అన్ని పేపర్లూ లీక్ అయ్యాయన్నారు. ఆనాటి ప్రభుత్వ మంత్రుల పీఏలే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్మారని ఆరోపించారు. ఆనాడు ఇంటర్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే నియామక సంస్థలను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు.

**ప్రజా దర్బార్‌లో అర్జీల వెల్లువ**

జీళ్ళచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయతీల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. న్యాయమైన ప్రతి సమస్యను 100 శాతం పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

## పశువుల అక్రమ రవాణాపై పకడ్బందీ నిఘా

**బక్రీద్ పండుగపై అప్రమత్తంగా ఉండాలి**
**రెండువర్గాల మధ్య ఘర్షణలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలి**
**పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలకు డీజీపీ దిశానిర్దేశం**




ముద్ర, తెలంగాణ బ్యూరో : బక్రీద్ పండుగ నేపథ్యంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 18న జరగనున్న బక్రీద్‌ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, రెండు వర్గాల మధ్య ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అక్రమ రవాణాను అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా 203 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పేర్కొన్నారు. పశువుల రవాణాకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కచ్చితంగా తనిఖీ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇక శాంతిభద్రతల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని డీజీపీ స్పష్టం చేశారు. అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, రోడ్లపైకి వచ్చి ఉద్రిక్తతలు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మరోవైపు, మున్సిపల్, పశుసంవర్ధక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని అధికారులు తెలిపారు. అవసరమైన చోట వెటర్నరీ వైద్యులను అందుబాటులో ఉంచి, సీజ్ చేసిన పశువుల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# పొదుపు మంత్రంతోనే ఆర్థిక స్థిరత్వం

- **ప్రధాని సూచనలు పాటిద్దాం**
- **యుద్ధ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించాలి**
- **వర్క్ ఫ్రమ్ హోమ్‌కే ప్రాధాన్యత**
- **ప్రధాని సూచనలతో స్వావలంబన దిశగా రాష్ట్రం**
- **బైసర్ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**



**ముద్ర, అమరావతి:** పశ్చిమ ఆసియా యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని సూచించిన ఎనిమిది అంశాలను ప్రజలు పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలని సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి ప్రాధాన్యత పెరుగుతోందని, ప్రభుత్వ పరంగా కూడా త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. విదేశీ పర్యటనలకంటే స్వదేశీ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని, అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని చెప్పారు.

అమరావతిలో బొల్లినేని ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్, ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, రాష్ట్రాన్ని విద్యా–వైద్య రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టాలనే లక్ష్యాన్ని వెల్లడించారు. ప్రపంచానికి అవసరమైన డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందిని అమరావతి నుంచి తయారు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పరిశ్రమలకు అనుమతులు ఆటోపైలట్ మోడ్‌లో ఇస్తామని, యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలో క్వాంటమ్ వ్యాలీ, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు, మెడికల్ హబ్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ చూపుతున్నామని పేర్కొన్నారు.

అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు భారీ మౌలిక సదుపాయాల ప్రణాళికలు అమలు చేస్తున్నామని, రైతుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

## 'మంత్రి అడ్లూరి'కి తప్పిన ప్రమాదం



**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు తప్పిన పెను ప్రమాదం**
**కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన**
**1వ ఫ్లోర్ నుంచి కిందకు పడిపోయిన లిఫ్ట్**
**ఆస్పత్రి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వ విప్**

ముద్ర, కరీంనగర్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రమాదం తప్పింది. ప్రమాదంలో మంత్రితో పాటు గన్ మెన్లు ఆసుపత్రి లిఫ్టులో వెళుతుండగా ప్రమాదం జరిగింది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్ లో మక్కల కొనుగోలు కేంద్రం వద్ద లారీ అదుపుతప్పి మంగళవారం పలువురు రైతులు గాయపడ్డారు. గాయపడ్డ రైతులుకరీంనగర్ లోని వన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నియోజకవర్గానికి చెందిన రైతులను పరామర్శించడానికి మంత్రి బుధవారం రాత్రి ఆసుపత్రికి చేరుకున్నారు. బాధితులను పరామర్శించడానికి మంత్రితో పాటు వ్యక్తిగత సిబ్బంది కలిసి లిఫ్టులో మూడో అంతస్తుకు వెళ్లుతుండగా లిఫ్ట్ వైరు తెగిపోవడంతో ఒక్కసారిగా లిఫ్ట్ కిందికి పడిపోయింది. అదృష్ట వశాత్తు మంత్రితో పాటు వ్యక్తిగత సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు.ప్రమాదం అనంతరం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రి పనితీరుపై తీరుపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. కరీంనగర్ లోని పలు ప్రైవేట్ ఆస్పత్రికి మెడికల్ కు సంబంధం లేని వ్యక్తులు నిర్వహిస్తూ ధనార్జన ధ్యేయంగా పనిచేస్తున్నారని మంత్రి ఆరోపించారు. కనీస వైద్య సదుపాయాలు లేకున్నా అర్హత లేని వైద్యులతో ఆసుపత్రిలో నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు. కరీంనగర్ లో మెడికల్ మాఫియా రాజ్యం ఎలుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ప్రమాదం నుండి ఎలాంటి గాయాలు లేకుండా మంత్రి బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## బండి సంజయ్ కుమారుడిపై లుక్ ఔట్ నోటీసులు జారీ చేయాలి

**మీడియాతో టీఆర్ఎస్ చీఫ్ కవిత**
**విదేశాలకు పారిపోకుండా చర్యలు చేపట్టాలి..**
**బాధితురాలికి న్యాయం చేయాలి**




ముద్ర, తెలంగాణ బ్యూరో :

ముద్రణ, తెలంగాణ బ్యూరో : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన నేపథ్యంలో వెంటనే లుక్‌ఔట్ నోటీసులు జారీ చేసి విదేశాలకు పారిపోకుండా చర్యలు తీసుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కె. కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడిన ఆమె, బడాబాబుల పిల్లలపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదనే భావన ప్రజల్లో పెరుగుతోందని తెలిపారు. బాధితురాలి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. పోలవరానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లే పాలమూరుకు కూడా జాతీయ హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. కామారెడ్డిలో జరిగిన రైల్ రోకో కేసులో రైల్వే కోర్టుకు హాజరైన అనంతరం ఆమె మాట్లాడుతూ, కేసులకు భయపడేది లేదని, అవసరమైతే నిరవధిక రైల్ రోకోకు సిద్ధమని ప్రకటించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 14-05-2026
www.mudranews.in | @mudranews



### జీర్ణక్రియకు అనుకూలం

ఎర్ర కందిపప్పును తక్కువ మసాలాలతో వండుకోవడం మంచిది. ఇలా చేయడం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగి కడుపులో అసౌకర్యం కలగదు.



## పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి

**- కలెక్టర్ సీహెచ్ ప్రియాంక**



**ముద్ర, నారాయణపేట:** పారిశుధ్యం, తాగునీటికి అధిక ప్రాధాన్యమిచ్చి పుర వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం ఉదయం మున్సిపాలిటీలోని 6 వ వార్డులో కొనసాగుతున్న పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ ను చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో గల బీసీ కాలనీలో పర్యటించిన కలెక్టర్ అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సానుకూలంగా స్పందించారు. మరుగుదొడ్లు లేవని పలువురు మహిళలు విన్నవించడంతో స్పందించిన ఆమె స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించి అనుమతి తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

## పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు సముచిత స్థానం

**. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజ్**


**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బాతుల నాగరాజ్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కో–ఆప్షన్ సభ్యులుగా మేన్గారి సుభాష్, మహమ్మద్ రహీం, చినోళ్ల సరిత హరి గౌడ్, ఆఫ్రిన్ జవేరియా అన్వర్ అమ్మద్ ఖాన్ ఎంపికయ్యారని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన వారిని గుర్తించి కో–ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నామని, భవిష్యత్తులో కూడా పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని బాతుల నాగరాజ్ పేర్కొన్నారు.

## ఆల్విన్ కాలనీ డివిజన్‌లో..
## రూ.63.85 లక్షల యుజిడి పనులకు శంకుస్థాపన



**ముద్ర, హైదరాబాద్:** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహాత్మా గాంధీ నగర్, గణేష్ నగర్, ఛత్రపతి శివాజీ నగర్, జయనగర్ కాలనీలలో రూ.63.85 లక్షల వ్యయంతో చేపట్టనున్న యుజిడి నిర్మాణ పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంక టేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు మరియు జలమండలి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక చొరవతో యుజిడి పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు. అత్యవసర ప్రాంతాల్లో పనులకు ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కాలనీల్లో స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

## కురుమూర్తి స్వామి దేవస్థాన
## నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలంలో శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు జి. మధుసూదన్ రెడ్డి, డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు నూతనంగా ఎన్నికైన చైర్మన్ బత్తుల బాలరాజ్ తో పాటు పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఎంతో మహిమగల దేవుడని, భక్తుల కోరికలు నెరవేరుతాయని అన్నారు. దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో భక్తుల సౌకర్యార్థం ఎలివేటెడ్ కారిడార్‌తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి రూ.110 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పనులు వేగంగా కొనసాగుతున్నాయని, త్వరలో ఘాట్ రోడ్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నూతన పాలకమండలి సభ్యులు భక్తులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే స్వర్ణ సుధాకర్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం..

**- పాఠశాల భవనానికి శంకుస్థాపన**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా కడ్తాల మండలం నార్లకుంట తాండ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామపంచాయతీలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. తదుపరి మక్తమాధారం గేట్ సమీపంలోని వైజీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆమనగల్, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ఎంఈవోల ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల నమోదు పెంపు, నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి పలు వివాహాలు, దశదినకర్మ కార్యక్రమాలకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ప్రభుత్వ పాఠశాలలు సమాజ మార్పునకు పునాదులు



**- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**

**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన విద్య వారోత్సవాల అవగాహన సదస్సులో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పాటు సర్పంచులు, కౌన్సిలర్ల బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి సీఎం స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు తాగునీరు, టాయిలెట్లు, పరిశుభ్రత వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని తెలిపారు. గతంలో ఆలస్యంగా అందే యూనిఫామ్‌లు, పుస్తకాలను ఇప్పుడు పాఠశాల ప్రారంభ రోజే అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. విద్యపై ఖర్చు భవిష్యత్ తరాలపై పెట్టుబడిగా భావించాలని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకం

**- ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి,**
**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ పట్టణంలోని డీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాభివృద్ధి అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు పాఠశాలలను తరచూ సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాలను పర్యవేక్షించాలని కోరారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ విద్య, నాణ్యమైన బోధన కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు డ్రాప్‌ఔట్‌లను తగ్గించేందుకు గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ తరగతులు, పాఠశాలల ఆధునీకరణ వంటి కార్యక్రమాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, నాగర్‌కర్నూల్ మండల విద్యాధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, వెంకటేశ్వర్ల శెట్టి, వివిధ మండలాల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యలపై
## కమిషనర్ కు బండి రమేష్ వినతి



**ముద్ర కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పెండింగ్ పౌర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీపీసీసీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హౌసింగ్ బోర్డు నుంచి హఫీజ్‌పేట్ వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ, స్వాన్ లేక్ నాలా పనుల పూర్తి, భువన విజయం షటిల్ గ్రౌండ్‌ను జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వ హించడం, కేపీహెచ్‌బీ కాలనీలో ఎమి నిటీస్ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. అలాగే కేపీ హెచ్‌బీలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఏర్పా టు చేయడంతో పాటు కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్‌కు కమ్యూనిటీ హాల్ కేటాయించాలని కోరారు. అల్లాపూర్ స్మశానవాటిక పెండిం గ్ పనులను పూర్తి చేసి జూన్ 2న ప్రారం భించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బండి రమేష్ వినతిపై కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, గాలి బాలాజీ, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో
## నెలవారి నేర సమీక్షా సమావేశం



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకు ప్రతి అంశం పారదర్శకంగా ఉండాలని, బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. కేసుల విచారణ వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసులు, కోర్టు మానిటరింగ్, డయల్–100 కాల్స్, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు నగదు రిఫండ్, దొంగతనం కేసుల డిటెక్షన్, హత్యలు మరియు అనుమానాస్పద మృతి కేసుల దర్యాప్తుపై సమీక్ష నిర్వహించారు. సైబర్ మోసాలు, మహిళా భద్రతపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని, పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని సూచించారు. అలాగే రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీలు సాయి వెంకట్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్, శ్రీనివాసులు, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నాపత్రం లీక్‌పై బీఆర్ఎస్వీ నిరసన




**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తాండూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్వీ నాయకులు నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు.

2024లో జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటన నుంచి కేంద్రం గుణపాఠం నేర్చుకోలేదని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని అన్నారు. ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను మళ్లీ పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంజాగుల శ్రీశైల్ రెడ్డి,దత్తాత్రేయ రావు, వినోద్ కుమార్, ఇంతియాజ్ పటేల్, మజార్, విక్రాంత్, రామకృష్ణ, తదితరులు బీఆర్ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.



## ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూలు:** నాగర్‌కర్నూలు జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన హాజరు వివరాలను ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ వెల్లడించారు. జనరల్ విభాగంలో 223 మంది విద్యార్థులకు గాను 204 మంది హాజరు కాగా, 19 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విభాగంలో 43 మందికి గాను 37 మంది హాజరై, 6 మంది గైర్హాజరయ్యారు.

జిల్లావ్యాప్తంగా 266 మంది విద్యార్థులకు 241 మంది పరీక్షలకు హాజరు కాగా, 25 మంది గైర్హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరీక్షలు సజావుగా నిర్వహించామని, తదుపరి పరీక్షలను కూడా ఇదే విధంగా ప్రశాంతంగా నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పాలీసెట్-2026

**- జిల్లాలో 93.64 శాతం హాజరు నమోదు**
**- జిల్లా పాలీసెట్ కన్వీనర్ మదన్‌మోహన్**

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లాలో పాలీసెట్–2026 ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసినట్లు జిల్లా పాలీసెట్ కన్వీనర్ మదన్‌మోహన్ తెలిపారు. జిల్లాకేంద్రంలో మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, బిజినపల్లి మండలం పాలెంలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో 2912 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 2727 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. దీంతో జిల్లాలో మొత్తం హాజరు శాతం 93.64గా నమోదైనట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించి భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ టీంలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సేవలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన పోలీస్, రెవెన్యూ, హెల్త్ తదితర శాఖల అధికారులు, సిబ్బందికి జిల్లా పాలీసెట్ కన్వీనర్ మదన్‌మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అబ్జర్వర్ మల్లయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 14.05.2026
www.mudranews.in | @mudranews



**మినప్పప్పుకు దూరంగా ఉండండి:**



మినప్పప్పు అరగడానికి ఎక్కువ సమయం పడుతుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. వేసవిలో దీనిని అతిగా తీసుకోవడం వల్ల కడుపు ఉబ్బరం వంటి సమస్యలు రావచ్చు.

# విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించాలి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, ధర్మపురి:** ప్రజాప్రతినిధులు విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కోరారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ధర్మపురి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు, డ్రాప్‌అవుట్‌ల నివారణ, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాల కల్పనపై సర్పంచ్‌లు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కోరారు. గ్రామాల్లో విద్యపై అవగాహన పెంచడం ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా నిలవాలంటే ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బలోపేతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రధాని పర్యటన ముగిసిన మరుసటి రోజే బండి సంజయ్ కుమారుడి కేసుపై ప్రభుత్వం ప్రత్యేక అధికారిని నియమించిందని తెలిపారు. సిట్ అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని బీఆర్ఎస్ నాయకులు వ్యాఖ్యానించడం తగదన్నారు. బీఆర్ఎస్ పాలనలో కూడా భగీరథ్ పై మీడి యాలో కథనాలు వచ్చాయని, అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. చట్టానికి ఎవరు అతీతులు కాదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి



**ముద్ర, ధర్మపురి:** ధర్మపురి పట్టణ కేంద్రంలోని స్థానిక హనుమాన్‌వాడలో, బుద్దేశ్‌పల్లె గ్రామంలోని కడారి గంగాధర్ ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో బుధవారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆయా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

**- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**




**బోథ్, ముద్ర:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక విద్యావారోత్సవాల్లో బుధవారం రిమ్స్ ఆడిటోరియంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లకు విద్యా సంబంధిత అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. పాఠశాలల అభివృద్ధిలో స్థానిక నాయకత్వం వహించినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. రెండేళ్ల కాలంలో సుమారు 40 కోట్ల రూపాయల నిధులతో జిల్లాలోని ట్రైబల్ వెల్ఫేర్, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేసి నట్లు తెలిపారు. ముఖ్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా తల్లిదండ్రులను విద్యా వ్యవస్థలో భాగస్వామ్యం చేశామన్నారు. వీటి పర్యవేక్షణలోనే యూనిఫాంల పంపిణీ, పాఠశాలల ఆధునీకరణ పనులు పారదర్శకంగా సాగుతున్నాయని వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని అంగన్‌వాడీ పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు ఎక్కడా విద్యార్థులు మధ్యలో చదువు ఆపకుండా (డ్రాపౌట్స్) పర్యవేక్షించాలని సూచించారు. దివ్యాంగ పిల్లల కోసం భవిత కేంద్రాలను బలోపేతం చేశామన్నారు. వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఆధునిక బోధనను అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. బడిబాట ద్వారా ప్రతి పాఠశాలకు నిర్దేశించిన ఎన్‌రోల్‌మెంట్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో, వార్డుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రజాప్రతినిధులను కోరారు. అనేక మంది మహనీయులు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదువుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ప్రచారం చేయాలని సూచించారు.

# ధాన్యం లిఫ్టింగ్ వేగవంతం చేయాలి

**- అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి**

**- కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు**



**ముద్ర, కరీంనగర్:** కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లిఫ్టింగ్ వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు అధికారులను కోరారు. బుధవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులను నష్టపరిచే విధంగా వ్యవహరించొద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో పారదర్శకత పాటించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ధాన్యం లిఫ్టింగ్ ఆలస్యం అవుతున్న ప్రాంతాల్లో అదనంగా రైస్ మిల్లులను కేటాయించాలన్నారు. రవాణా, లాజిస్టిక్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు. లిఫ్టింగ్ సమస్యలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.

బీ–గ్రేడ్ పేరుతో రైతుల ధాన్యంపై అన్యాయంగా తగ్గింపులు చేయడం సరికాదన్నారు. ధాన్యం నాణ్యత విషయంలో అధికారులు న్యాయబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. రైతులకు నష్టం కలిగించే విధంగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. రైతుల కష్టార్జిత ఫలితానికి తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తోందని, ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఎస్సారెస్పీ కెనాల్ భూమి కబ్జా

**- రంగంలోకి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు**

**- హద్దులు నిర్ణయించిన రూరల్ తహసీల్దార్ హకీమ్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండ నర్సింగాపూర్ గ్రామ శివారులోని డబుల్ బెడ్ రూముల ఇళ్ల నుంచి గేట్ల వరకు గల ఎస్సారెస్పీ కెనాల్ భూమిని కొందరు కబ్జా చేశారు. ఈ భూ కబ్జాపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో బుధవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్పంచ్ వంశీ, గ్రామస్తుల సహకారంతో ప్రభుత్వ ఎస్సారెస్పీ భూమిని పరిశీలించారు. అనంతరం కెనాల్ భూమి హద్దులు నిర్ణయించినట్లు జగిత్యాల రూరల్ మండలం తహసీల్దార్ సాదాబ్ హకీమ్, ఇరిగేషన్ అధికారి డీఈ ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగాపూర్ సర్పంచ్ కుక్కునూరి వంశీ, గిర్దవార్లు చిట్యాల భూమయ్య, శ్యామ్మొద్దీన్, జీపీఓ శ్రీనివాస్ , నర్సయ్య, ఎస్సారెస్పీ, ఇరిగేషన్ అధికారులు, లష్కర్ లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ ఎస్సారెస్పీ భూమిని గ్రామ అవసరాల నిమిత్తం ఐకేపీ సెంటర్, గ్రామ అవసరాలకు వినియోగించుకోవాలని జగిత్యాల రూరల్ తహసీల్దార్ సాదాబ్ హకీమ్ సూచించారు.

# నేనేం పాపం చేశాను..

**- కేంద్ర విద్యాలయ స్థల విషయంలో ఎంపీ అర్వింద్ దీక్ష చేయడం తగదు**

**- ఎమ్మెల్యే సంజయ్ కుమార్**




**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** నేనేం పాపం చేశాను.. నన్నెందుకు జగిత్యాలలో కేంద్ర విద్యాలయ స్థల విషయంలో ఎంపీ అర్వింద్ బద్నామ్ చేస్తున్నరని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర విద్యాలయ స్థల విషయంలో జగిత్యాలలో నిరసన దీక్ష పేరుతో ఎంపీ అర్వింద్ రాజకీయం చేయడం తగదన్నారు. ఎమ్మెల్యేగా స్థల విషయంలో మీరు తనను దోషి గా నిలబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర విద్యాలయ స్థల విషయంలో సంబంధిత మంత్రులను, సీఎం ను పలుమార్లు కలిశానన్నారు. కేంద్ర విద్యాలయం స్థల విషయంలో ఎంపీ తనను ఎందుకు దోషి గా చూపే ప్రయత్నం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పదేళ్లు ఎంపీగా ఉండి జగిత్యాల నియోజకవర్గంలో ఏ ఒక్క బ్రిడ్జి కూడా నిర్మాణం చేయలేదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు అడిగినా కేంద్రం రూపాయి కూడా ఇవ్వట్లేదన్నారు. కేంద్ర విద్యాలయ స్థల విషయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ కు పలుమార్లు విన్నవించా నని, టీఆర్ నగర్ లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమా వేశంలో డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నంద య్య, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నారా యణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండ శం కర్, దామోదర్ రావు, గిరి నాగ భూషణం, గట్టు సతీష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు తాగునీరు, పండ్లు పంపిణీ



**ముద్ర, కోరుట్ల:** పట్టణంలో బుధవారం జమాత్ ఇస్లామి హింద్ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులకు చల్లని మంచినీరు, అరటి పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ల్లో ఏర్పాటు చేసిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తాగునీరు, అరటిపండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఇలియాజ్ అహ్మద్ ఖాన్, జిల్లా అధ్యక్షుడు ఎం డీ నైముద్దీన్, ఎంపీజే అధ్యక్షుడు ఎండీ నసీర్, ఎస్ ఐ ఓ అధ్యక్షుడు అద్నాన్, ఐట సెక్రటరీ ఎండీ. ఫసియొద్దీన్, షకీల్, ఎస్ఐ ఓ సభ్యులు అతాఉ రహ్మాన్ ఖాన్, ఒసామా, ఆరిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# మెగా క్యాంప్ ఏర్పాటు చేస్తాం

**- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లా కేంద్రంలో దివ్యాంగుల కోసం మెగా క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వెల్లడించారు. విద్యావారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు, కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో దివ్యాంగుల కోసం పెద్ద క్యాంప్ ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానని తెలిపారు. దివ్యాంగ పిల్లల పోషణలో తల్లి తల్లిదండ్రుల పాత్ర గొప్పదన్నారు. ఆ విషయం మరిచిపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఈఓ భోజన్న, స్థానిక కౌన్సిలర్ గంజి రాజు, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, నారా యణ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు జింక సూరి, శ్రీరామోజీ నరేష్, అర్జున్, శశాంక్, సాత్విక్ తో పాటు పట్టణ బీజేపీ నాయకులు, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శనగపప్పు జాగ్రత్తలు



శనగపప్పు వల్ల గ్యాస్ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఎండలు ముదురుతున్న సమయంలో దీని వినియోగాన్ని తగ్గించడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

## బోరు పనులు ప్రారంభించిన చైర్‌పర్సన్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని ఎనిమిదో 8వ వార్డులో గల జంఖానా గూడెం లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతూ మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ బోరు వేయించే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక కౌన్సిలర్ తహేరా బబ్లు ఆధ్వర్యంలో "ప్రజల మౌలిక సదుపాయాల కల్పనే మా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే మా లక్ష్యం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో డీ ఈ కొండలరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, స్థానిక కౌన్సిలర్ తహేరా బబ్లు, బర్రె కరుణాకర్ కాంగ్రెస్ నాయకులు కూర శివకుమార్, నీలం సత్యనారాయణ, ఎండీ షాహెద్, కిట్టు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## ఉపాధి కూలీలకు అవగాహన

**ముద్ర, ఖమ్మం:** బూర్గంపహాడ్ మండలంలో ఉపాధి హామీ కూలీలకు ఎంపీడీఓ జమలారెడ్డి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. బుధవారం బూర్గంపహాడ్‌లో ఈజీఎస్ ఏపీఓ విజయలక్ష్మితో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేశారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ–కేవైసీ చేయించుకోవాలని, లేనిపక్షంలో జాబ్‌కార్డులో పేర్లు తొలిగిపోతాయని కూలీలకు వివరించారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న వ్యక్తులు మాత్రమే పనులకు వచ్చేలా చూడడానికి, ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా ఈ–కేవైసీ సేకరిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీలు తమ సమీపంలోని గ్రామ పంచాయతీ లేదా ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా ఈకేవైసీ అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. ఈ– కేవైసీ లేని కూలీలకు పనులు చేసినా వేతనాలు రావని, ఇందుకోసం ఉపాధి కూలీలు తప్పకుండా ఈ–కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. సర్పంచ్ మందా నాగరాజు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

## లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ నుండి తొలిగించాలి

**ముద్ర, ఖమ్మం:** అడ్డదారిన ఎస్టీ రిజర్వేషన్‌ను అనుభవిస్తున్న లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ నుండి వెంటనే తొలిగించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా.మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం భట్టుపల్లి పంచాయతీ వీరాపురం క్రాస్ రోడ్డు కొమరం భీం విగ్రహం వద్ద ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలెబోయిన వెంకటనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలం వేణుగోపాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3న మహబూబాబాద్ జిల్లా పరిధిలోని పాకాల కొత్తగూడలో ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలిగించాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగునున్న భారీ బహిరంగ సభకు అన్ని గ్రామాల నుండి తరలివచ్చి ఐక్యతతో ప్రభుత్వానికి ఆదివాసీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుతారి నాగేశ్వరరావు, కలం సంపత్ కుమార్, సాంబమూర్తి, చందా రామకృష్ణ, నాగకృష్ణ, స్వామి ప్రసాద్, రాజు, వెంకటేశ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# నిత్య కళ్యాణం.. పచ్చ తోరణం



ఏకాదశిని పురస్కరించుకొని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రాతః కాలంలో నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. నూట ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో పాదపద్మార్చన సేవ గావించారు. శ్రీవారి వైభవోత్సవ మండపంలో నిత్య కళ్యాణ మహోత్సవాన్ని వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారు సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

– ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ ఉద్దేశ్యం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** నాణ్యమైన బోధన మెరుగైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ లెర్నింగ్, విద్యార్థుల సంక్షేమం, సమాజ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో విద్యా వారోత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి లో మున్సిపల్ చైర్మన్, సర్పంచ్, వార్డు మెంబర్ లకు వర్క్ షాప్ నిర్వహించారు. విద్యా శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జిల్లాలో పాఠశాలల లోని మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్ , అదనపు తరగతి గదులు, తదితర మరమ్మత్తులు చేసుకోవడం జరుగుతుందన్నారు. ఇంటర్నేషనల్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ పాఠశాల ద్వారా ప్రతి పేద విద్యార్థి మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగేలా అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూడా పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. జూన్ 2 నుండి ప్రీ– ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ స్థాయి విద్యార్థులందరికీ ఉదయానే అల్పాహారం, పాలు, జావ వంటివి అందిస్తున్నామన్నారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. జిల్లాలో పదవ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా ఉత్తీర్ణత ఫలితాలు విద్యార్థులు సాధించారన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతుల సదుపాయాలు, మంచి వాతావరణంలో ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ లో కూడా వచ్చే విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్నం భోజన పథకం అమలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఎక్కువ మొత్తంలో చేర్పించేందుకు కృషి చేయాలి అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రవేట్ పాఠశాలకు వెళ్లకుండా, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా స్థానిక ప్రజా ప్రతినిధులు చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంఈవోలు, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకటరెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల, ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బాలామణి, సర్పంచులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత



ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డి గూడెంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పి స్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తృతంగా లభిస్తాయన్నారు.

# ప్రాణాలు తీస్తున్న రసాయన కంపెనీలు

ప్రముఖ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తమ రెడ్డి



**ముద్ర, నల్గొండ:** రసాయన కంపెనీల నుంచి వెలువడే విష వాయువులు ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పుగా మారి ప్రాణాలు బలిగొంటున్నాయని ప్రముఖ పర్యావరణవేత్త, ప్రొఫెసర్ పురుషోత్తమ రెడ్డి అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మగూడెం గ్రామ శివారులోని రసాయన కంపెనీల నుండి వెదజల్లుతున్న కాలుష్యానికి నిరసనగా కాలుష్య విముక్తి పోరాట సమితి ఆధ్వర్యంలో అఖిలపక్ష కమిటీ గ్రామస్తుల ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాస్జీన్ వాయువు అత్యంత విషపూరితమైనదని, మొదటి ప్రపంచ యుద్ధంలో శత్రువులను చంపడానికి వాడిన విషపూరిత రసాయనం ఇప్పుడు సైలెంట్ కిల్లర్ గా అంతమ్మగూడెంలో ప్రజల ప్రాణాలను అరిస్తుందన్నారు. హెజో లో ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తీవ్రమైన వాయువు నీరు, భూమి కాలుష్యానికి పాల్పడుతుందన్నారు. పీల్చే గాలిలో పాస్జీన్, బెంజిన్, ఇథైల్ బెంజిన్, టోలిన్, ఎసిటోన్, డైక్లోరో మీథెన్, డైమిథైల్ ఫార్మామైడ్, నాప్తాలిన్ ప్రమాదకర రసాయనాలు గాలిలో చేరాయని, దీంతో ప్రజలు వింత రోగాలతో అనారోగ్యాలు బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల సమీపంలో 9 నుండి 30 ఫీట్లు భూమి కింది భాగంలో పూర్తిగా రసాయనలతో నిండి ఉందని, కాలుష్య నిబంధనలు ఉల్లంఘించిన రసాయన కంపెనీలపై పీసిబి అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కంపెనీల కాలుష్యంపై సమగ్ర దర్యాప్తు జరిపించి పొల్యూషన్ వల్ల నష్టపోయిన రైతులు, ప్రజలకు నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీల్చే విష వాయువుతో ప్రజలు బతికే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరాకు రూ.52 వేల నష్ట పరిహారం రైతులకు అందించాలని, సాగు, త్రాగు నీరు కల్పించాలని, వాతావరణం గాలిని కొలిచే యంత్రం ఏర్పాటు, స్థానిక ప్రాథమిక హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్ టాక్స్ రిటైర్డ్ ఆఫీసర్ మల్లికార్జున్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర నాయకుడు పాకనాటి దామోదర్ రెడ్డి, అంతమ్మగుడం కాలుష్య విముక్తి పోరాట సమితి గౌరవ అధ్యక్షుడు గుమ్మి నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు గుమ్మి దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వస్పరి ప్రభ, ఉపాధ్యక్షులు రావుల రామ్‌రెడ్డి, రేణుక, గుర్రం రామచంద్రారెడ్డి, కాలుష్య బాధితులు రావుల శశికిరణ్, గ్రామస్తులు నరసింహ బాల్‌రెడ్డి మహేష్, శివరాజు, రమేష్, లింగయ్య, జంగమ్మ, ధనలక్ష్మి, ముత్తమ్మ, సురేందర్ రెడ్డి, ఫకీరు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గ్రామీణాభివృద్ధి డిప్యూటీ సెక్రటరీ యానా యాస్మిన్



**ముద్ర, ఆత్మకూరు (ఎం):** ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వి సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ డాక్టర్ యాన యాస్మిన్ సూచించారు. బుధవారం ఆమె ఆత్మకూరు మండలంలోని సర్వేపల్లి గ్రామం లో మహిళ సంఘ భవనము సందర్శించడం జరిగింది. అనంతరం సర్పంచ్ కల్వకుంట్ల ఉపేందర్ రెడ్డి ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ నాగిరెడ్డి,అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్,ఎంపీడీవో రాములు నాయక్, ఏ పీ ఓ రమేష్ ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఇంజనరేష్, వి బి కే లావణ్య ఎపిఎం,సిసి కొమురయ్య వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేసే వారి వివరాలు సేకరణ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** నేపాల్, బీహార్, ఒరిస్సా జార్ఖండ్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తున్న వ్యక్తుల సమాచారాన్ని సేకరిస్తున్నట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అక్షాంష్ యాదవ్ సూచనల మేరకు ఇటీవల హైదరాబాద్ లో జరిగిన వరుస సంఘటన నేపథ్యంలో బుధవారం భువనగిరి పట్టణంలో షాపులు, హోటళ్లు, రిసార్ట్ లలో నేపాల్, బీహార్, ఒరిస్సా జార్ఖండ్, ఇతర రాష్ట్రాలకు సంబంధించిన పని చేయు వ్యక్తుల సమాచారాన్ని సేకరించిన్నట్లు తెలిపారు. వీరి నేర చరిత్రను చెక్ చేసి ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం లో నమోదు చేసిన్నట్లు చెప్పారు. దీనివలన ఈ వ్యక్తులు భవిష్యత్తులో ఎటువంటి నేరాలకు పాల్పడిన వారి వేలిముద్రల ద్వారా గుర్తించడం సులభం అవుతుందని వీరి బంధువుల వివరాలు, స్థానికతకు సంబంధించిన అంశాలు కూడా సేకరించడం జరిగిందన్నారు. భువనగిరి పట్టణ ప్రజలు, వ్యాపారులు ఎవరినైనా వ్యక్తులను పనిలోకి చేర్చుకునే ముందు వారిని పోలీస్ స్టేషన్ తీసుకువస్తే వారి నేరచరిత్ర వివరాలను చెక్ చేసి మీకు క్లియరెన్స్ ఇవ్వడం జరుగుతుందని అంతేకాకుండా భవిష్యత్తులో వారు నేరాలకు పాల్పడినచో గుర్తించడం సులభతరం అవుతుందన్నారు.

## నిలిచిన ధాన్యం కొనుగోళ్లు



**ముద్ర, ఖమ్మం:** బూరంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం సేకరణ నిలిచిపోవడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యార్డులో ధాన్యం బస్తాలు పేరుకుపోవడంతో లారీల కొరత కారణంగా ధాన్యం సేకరణ నిలిపివేయడంతో రైతులు అసహనానికి గురవుతున్నారు. మరోపక్క వాతావరణ మార్పులు చోటుచేసుకుంటున్నా, వర్షసూచన ఉన్నా కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం బస్తాలను సకాలంలో తరలించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి ధాన్యం బస్తాలు ఆరుబయటే ఉండిపోవడంతో తేమ పట్టి నాణ్యత దెబ్బతినే ప్రమాదం సైతం ఉందని ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా లారీల ఏర్పాటు మొక్కుబడిగా ఉండటం, లారీల కొరతతో ధాన్యం తరలింపు నిలిచిపోవడంతో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదరవుతున్నాయి.

## అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలి




**ముద్ర, ఖమ్మం:** అర్హులైన పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చా వెంకటేశ్వర్లు, రేపాకుల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలో వ్యవసాయ కార్మికులతో కలిసి తాసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండవ విడత మంజూరు చేసే ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన పేదలకే ఇవ్వాలన్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలాలు ఇవ్వాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### కందిపప్పు వాడకం:

నిత్యం వాడే కందిపప్పు శరీరానికి వేడి కలిగించే అవకాశం ఉంది. వేసవి లో కంది పప్పును గ ట్టిగా వండు కోకుండా, పల చగా పప్పుచారులా తీసుకోవడం ఉత్తమం.



# మెదక్ లో మరో శిశు విక్రయం

**- రూ. 3 లక్షలకు అమ్మకం**

**- తొమ్మిది మంది అరెస్ట్**



**ముద్ర ప్రతినిధి మెదక్:**

మెదక్ జిల్లాలో మరో శిశు విక్రయం కలకలం రేపింది. తాజాగా శిశువును రూ.3 లక్షలకు విక్రయించగా 9 మందిని అరెస్ట్ చేశారు. బుధవారం మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్ వివరాలు వెల్లడించారు. కొల్చారం మండలం పోత రెడ్డిపల్లి తండాకు చెందిన దేగవత్ శిరీషకు మార్చి 27న మెదక్ ఎంసీహెచ్ లో నాలుగో కాన్పులో ఆడ శిశువు జన్మించింది. నలుగురు పిల్లలను పోషించడం భారంగా మారడంతో శిరీష, ఆమె భర్త దేవి సింగ్ లు వారికీ బంధువులైన ఆర్మూర్ కు చెందిన శారద అనే మధ్యవర్తి ద్వారా ఏప్రిల్ 1న ములుగు మండలం అల్లినగర్ గ్రామానికి చెందిన బొమ్మ లింగయ్య, అతని బార్య బొమ్మ కలమ్మలు తమకు సంతానం లేకపోవడంతో రూ.3 లక్షలకు కొనుగోలు చేశారు. శిశువు తల్లి దండ్రులకు రూ.40 వేలు చెల్లించిన శాదా మిగతా మధ్యర్తులకు రూ.10 వేల చొప్పున ఇవ్వగా రూ.2 లక్షల 10 వేలు ఆమె వద్ద ఉంచుకుంది. అంగన్వాడీ సూపర్వైజర్ అనసూయ ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసి శిశువులు విక్రయించిన తల్లి శిరీష, మధ్యవర్తి శారద, ఈ కేస్ తో సంబంధం ఉన్న గూగులోత్ సోనీ, రాజు, ప్రమీల, మహేందర్, భాస్కర్ తో పాటు శిశువును కొనుగోలు చేసిన ములుగు మండలం బొమ్మ లింగయ్య, ఆమె భార్య కలమ్మలను అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు. శిరీష భర్త దేవి సింగ్ పరారీ లో ఉన్నాడు. ఈ సమావే శంలో టౌన్ ఇన్స్పక్టర్ మహేష్, ఎస్ఐ నారాయణ ఉన్నారు.

**శిశు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు..**

శిశు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి హెచ్చరించారు. జిల్లాలో అక్రమ దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే నిబంధనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా బాలల పరిరక్షణ విభా గం అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## పంచాయితీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

**-సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల స్వామి**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాలనర్సయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి హాజరై మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు వేతనాలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 140 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న హక్కులను నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడలుగా విభజించి నూతన చట్టాలు తెచ్చిందన్నారు. నూతన చుట్టాలను అమలుచేస్తే కార్మికులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. తమ హక్కుల కోసం సమ్మె చేసే హక్కును కోల్పోతారన్నారు. ప్రస్తుతం 8 గంటల పనిని 12 గంటలకు పెంచే విధానం అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మికులకు తీవ్రమైన నష్టం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దుచేసి పాత చట్టాలు కొనసాగించాలన్నారు. రూ.26 వేల కనీస వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ లాంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను ప్రత్యేక స్టేటస్ కల్పించి కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పంచాయతీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రీన్ చలాన్ ద్వారా వేతనాలు చెల్లి స్థానన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్, కోశాధికారి చిట్యాల కనుకయ్య, ఉపాధ్యక్షులు ప్రభాకర్, కొమురయ్య, మహిళా నాయకురాలు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బండి భగీరథ్ ను అరెస్ట్ చేయాలి

**-సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి**




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు భగీరథ్ పై నమోదైన ఫోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో జరిగిన పార్టీ సమావేశంలో మల్లారెడ్డి మాట్లాడుతూ బెదిరింపులకు గురిచేసి కేసు సెటిల్మెంట్ ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. దేశంలో భేటీ బచావో – బేటి పడావో అని నినాదాలు ఇస్తూ బీజేపీ నాయకత్వం మహిళలపై జరుగుతున్న దాడుల విషయంలో నేరస్తులను కాపాడే సంస్కృతిని ప్రోత్సహిస్తుందని విమర్శించారు. బండి సంజయ్ ని కేంద్ర మంత్రి పదవి నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాత్ర పై సమగ్ర విచారణ జరపాలన్నారు. పోక్సో కేసు నమోదై ఐదు రోజులు గడిచినా నిందితుడిని అరెస్టు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. బాలికపై లైంగిక దాడి జరిగితే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోకుండా, బండి సంజయ్ కుటుంబానికి కొమ్ముకాస్తున్నట్లుందని అన్నారు. అధికార దాహంతో తన కుమారుడు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఇది మహిళల భద్రతను తాకట్టు పెట్టడమే అవుతుందన్నారు. భగీరథను అరెస్టు చేయకుంటే. పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, సందబోయిన ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ప్రతినిధులకు అవగాహన

**ముద్ర, హైదరాబాద్:**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పాఠశాల విద్య బలోపేతంపై ప్రజా ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. నాణ్య మైన విద్యతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. గ్రామాల్లోని తల్లిదండ్రులకు ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఇందుకు ప్రజా ప్రతిని ధులు ఎక్కువ చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాజులు తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తర తెలంగాణ జిల్లా వార్తలు..**

## ప్రభుత్వ వైఖరితో అన్నదాతకు అరిగోస

**- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి వల్ల అన్నదాతకు గోస తప్పడం లేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ ను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు అరిగోస పడు తున్నారన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అన్నదాతలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ లో ఎక్కడికక్కడ కుప్పలుగా పడి ఉన్న మొక్కజొన్నను చూసి అధికారులను నిలదీశారు. కొనుగోలుకు సంబంధించి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొక్కజొన్న పంట పూర్తి స్థాయిలో కొనుగోలు కాక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ధాన్యం కోతకు వచ్చి కల్లాలకు వస్తుంటే అకాల వర్షాలు సంభవించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం రైతులకు గన్ని బ్యాగ్ లు, లారీ ట్రాన్స్ పోర్ట్ కు సంబంధించి ఏర్పాట్లను చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతు ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టొద్దు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఎలాంటి ఇబ్బంది పెట్టొద్దని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. అల్లాదుర్గం మండలం గడి పెద్దాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం, పాపన్నపేట్ మండలంలోని కుర్తివాడలో ప్యాక్స్ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలన్నారు. మిల్లులకు త్వరగా తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచి, వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లోనే నాణ్యత పరిశీలన అనంతరం రైతులకు వెంటనే రశీదులు ఇవ్వాలన్నారు. రైస్ మిల్లుల వద్ద ఎలాంటి కోతలు ఉండకూడదని ఆదేశించారు. పంట రవాణా కోసం ఖాళీగా ఉన్న అన్ని వాహనాలు, ట్రాక్టర్లు, డీసీఎంలను పూర్తిస్థాయిలో వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట అధికారులు నిత్యానంద్, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి, సంగునూరు మండలం ముంద్రాయి గ్రామాల్లో ధాన్య కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు సజావుగా జరుగుతుందన్నారు. ఏఎంసీ లలో మక్కల కొనుగోళ్లు సైతం వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తేమ శాతం వచ్చి లిఫ్ట్ చేయడానికి తయారుగా ఉన్న ధాన్యాన్ని లారీలు వచ్చే వరకు ఆగకుండా స్థానికంగా అందు బాటులో ఉన్న ట్రాక్టర్ ఇతరత్ర వాహనాలలో మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. టెంట్, కుండలో తాగునీరు, తాలు తీసే యంత్రాలు, వేయింగ్ మిషన్స్, టార్పాలిన్ కవర్లు, సుతిల్ దారాలు, గన్ని బ్యాగులు ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అన్ని సెంటర్ లలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, మిల్లులో దిగుమతిలో జాప్యం జరగకుండా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.

## జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జన గణనలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం పాపన్నపేట్ మండలంలోని కుర్తివాడ, అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలోని జన గణన 2027 ను తహసీల్దార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రతి పదేళ్లకు ఒకసారి సెన్సస్ నిర్వహించబడుతోందన్నారు. కోవిడ్ కారణంగా ఆలస్యమైనప్పటికి, ఇప్పుడు 16వ జన గణన చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వివరాలను ఇవ్వాలన్నారు. ఎవరూ సమాచారం దాచకూడదని స్పష్టం చేశారు. జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశగా హౌస్ లిస్టింగ్ చేపట్టి, ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలపై వివరాలు సేకరిస్తామని చెప్పారు. ఇందులో నీటి కనెక్షన్, మరుగుదొడ్డి, గ్యాస్ కనెక్షన్, ఫోన్, ఇంటర్నెట్, తరచుగా వినియోగించే ఆహార ధాన్యాలు వంటి అంశాలు నమోదు చేస్తారని తెలిపారు. గృహ వివరాలు సేకరించి డిజిటల్‌గా భద్రపరుస్తామని పేర్కొన్నారు.


Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com